# దొరుకునా ఇటువంటి సేవ...

సాయంత్రం ఏడు గంటలు.

శ్రీ ఛత్రపతి శివాజి అంతర్జాతీయ విమానాశ్రయం నుండి 'ఇండియన్' ఎయిర్ బస్ 320 నింగిలోకి దూసుకెళ్ళింది. ప్రయాణీకులకు సూచనలు, ఆపత్కాల పరిస్థితుల్లో వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల వివరణ జరిగింది. విమాన సిబ్బంది ప్రయాణీకులకు చాక్లెట్లు పంచడం, వారి అవసరాలను తీర్చడంలో నిమగ్నం అయ్యారు. కొందరు వార్తాపత్రిక కావాలంటే కొందరు మంచి నీళ్ళడుగుతున్నారు. కొందరికేమో చెవిలో పెట్టుకోడానికి దూది కావాలట! (ఇంకా నయం పూవు అడగలేదు!) కొందరు ప్రయాణీకులు బాత్రూం వైపు కదిలారు. నలుగురు ఎయిర్ హోస్టెస్ లలో ఇద్దరు నలభైకి పైబడ్డవారే. వారు కాక్‌పిట్‌లో ఏవో సర్దుతూ కబుర్లలో పడ్డారు. ముప్పై-ముప్పై అయిదు మధ్య ఉన్న మిగతా ఇద్దరు ప్రయాణీకుల బాధ్యత తమ భుజస్కందాలపై వేసుకున్నారు! శమిత కాస్త విసుక్కుంటూ పని చేస్తున్నా, నమిత మాత్రం ప్రయాణీకులు పెట్టే ఇబ్బందులకు చిరు మోముతో ఎదుర్కొంటోంది. కాదనకుండా వారి అవసరాలను తీరుస్తోంది. ప్రయాణీకులకు భోజనం సరఫరా చేసి, ఆ ప్లేట్లన్నీ తీసింతర్వాత నమిత, శమిత కాక్‌పిట్‌లో కలుసుకున్నారు.

"ఇరవై రెండు 'ఏ' అతన్ని చూశావా శమితా?"

"ఎవరూ? ఆ గుడ్లగూబ కండ్లతనేనా?"

"అవునువాడే. యమ విసిగిస్తున్నాడనుకో. పేపరు కావాలంటే 'టైమ్స్' ఇచ్చాను.

కాదు 'మిద్దే' కావాలన్నాడు. అదీ ఇచ్చాను. ఆ తర్వాత మంచి నీళ్ళిమ్మన్నాడు. అవి ఇచ్చాక, తలతిరుగుతోంది, నిమ్మరసం కావాలన్నాడు. ఆబగా తినేసేలా ఆ చూపులూ, ఏమైనా ఇస్తుంటే కావాలనే చేతులు తాకటం, ఆ వెకిలి చేష్టలు వాడునూ. అబ్బ భరించలేకుండా ఉన్నాననుకో" నమిత వాయించింది.

"బెల్ కొడితే నేనూ వెళ్ళాను. వాడడిగింది ఇచ్చాను. ఆ వాలకం, అదీ నచ్చక మళ్లీ ఆ వైపు చూడలేదు. అందుకే నిన్ను పట్టినట్టున్నాడు."

మళ్ళీ బెల్. అదే ఇరవై రెండవ వరుసనుండి నమిత ఆ వైపు అడుగులేసింది. అదే 'ఏ' సీటతను వాంతి అవబోతోందని సైగ చేశాడు. వామిటింగ్ బ్యాగ్ ఇచ్చేలోపలే భళ్ళున వాంతి చేశాడు. అంతా విస్కీవాసన. ఫ్లైట్‌లో మద్యం నిషిద్ధమని తెలిసి, బయటే మందుకొట్టి వచ్చినట్టున్నాడు. ప్రక్కసీట్లో వాళ్ళు బయటకు రాగానే, నమిత వెళ్ళి ఆ చోటంతా శుభ్రం చేసింది. అతన్ని వాష్ రూం కి తీసికెళ్ళి బట్టలు కడిగింది. తిరిగి సీట్లో కూచోబెట్టింది. ఇంతలో ఫ్లైట్ హైదరాబాద్‌లో దిగడానికి సిద్ధంగా ఉందని ప్రకటించాడు పైలట్.

శారీరకంగా, మానసికంగా అలసిపోయిన నమిత, శమితలు డ్యూటీ దిగి, తమ హోటల్ రూంవైపు బయలుదేరారు.

మర్నాడు ఉదయం ఫ్లైట్‌లో కలకత్తా వెళ్ళి, అక్కడి నుండి సాయంత్రం వరకు ముంబయి చేరింది నమిత.

నమిత అలియాస్ నాగమణి, పుట్టి పెరిగింది ముంబయిలో. వాళ్ళ నాన్న యాభైఏళ్ళ క్రితం నిజామాబాద్ జిల్లా నుండి పొట్ట చేతబట్టుకుని వచ్చాడు. భవన నిర్మాణ కూలీగా జీవితం ప్రారంభించిన రంగయ్య, కఠోర శ్రమతో మొక్కవోని పట్టుదలతో 'ఏ'క్లాస్ కాంట్రాక్టరుగా ఎదిగాడు. తన ముగ్గురు కూతుళ్ళనూ, ఇద్దరు కొడుకులనూ వారి అభిరుచుల మేర చదివించాడు. వారికి తగ్గ సంబంధాలు తెచ్చి పెళ్ళిళ్లు చేశాడు. కూతుళ్ళలో నమిత చివరిది. డిగ్రీ చదివిన నమిత మొదట ఓ ప్రైవేటు కంపెనీలో రిసెప్షనిస్టుగా చేరింది. ఆ తర్వాత శాంతి కిరణ్‌తో పెళ్ళయింది. పెళ్ళైన ఏడాదికి "ఇండియన్ ఎయిర్‌లైన్స్"లో ఎయిర్ హోస్టెస్‌గా ఎంపికయింది.

శాంతి కిరణ్, ఖమ్మం జిల్లాకు చెందినవాడు. ఇంజనీరింగ్ చేసి, ఉద్యోగ రీత్యా ముంబయి వచ్చాడు. తల్లిదండ్రులు, మిగిలిన కుటుంబమంతా ఆంధ్రాలోనే ఉన్నా, అతను మాత్రం ముంబయిలోనే స్థిరపడ్డాడు. నగర శివార్లలో ఫ్లాటు కూడా కొన్నాడు. ఇంటికి రాగానే పిల్లలను దగ్గరకు తీసుకుని గుండెలను హత్తుకుంది నమిత. శశికిరణ్

అయిదో తరగతి, ప్రీతి ఒకటో క్లాసు చదువుతున్నారు. స్కూల్ నుండి వచ్చి భోం చేసి ఓ గంట పడుకుంటారు. నిద్రలేచి కాసేపు టీవీ చూసి సాయంత్రం ట్యూషను వెళతారు.

తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగస్తులవడంతో వారి ఆలనా పాలనకి ఫుల్ టైం ఆయా ఉంది. ఆమె కూడా ఆంధ్రా నుంచి దిగుమతి అయిన బాపతే. పిల్లలను బాగానే చూస్తుంది. ఆమెను కూడా తమ కుటుంబ సభ్యురాలిగా చూస్తారు శాంతి కిరణ్ దంపతులు.

"అమ్మా! అన్నయ్య నన్ను గట్టిగా గిల్లాడు" ప్రీతి కంప్లైంట్.

"గిల్లక? ఎత్తుకని ముద్దుపెట్టాలా? అమ్మ రేపొస్తుందని చెప్పినా, అమ్మే కావాలని మారాం చేస్తే ఎలా ఊరుకునేది?"

"అదికాదు కన్నా! చెల్లాయి చిన్న పిల్లకదా? సముదాయించాలి కాని అలా గిల్ల వచ్చా?"

"ఏంటమ్మా నువ్వు కూడా చెల్లాయివైపే ఉంటావు? నాన్న రానివ్వు మీ ఇద్దరి సంగతి చెబుతా" శశి ఏడుపు కొచ్చాడు.

శశిని దగ్గరకు తీసుకుని కన్నీళ్ళు తుడిచింది నమిత. కలకత్తా నుంచి తెచ్చిన రసగుల్లా, హైదరాబాద్ నుండి తెచ్చిన చేగోడీలు పిల్లలిద్దరికీ ఇచ్చింది. పిల్లలు, వారి జగడం మరచిపోయారు. తల్లి ఇచ్చినవి ఒకరొకరితో పంచుకుని, కలసిపోయారు. వారిని చూసి నమిత కడుపునిండింది. ఇంట్లో ఉన్నప్పుడు పిల్లలే లోకంగా గడుపుతుంది నమిత.

"తల్లి తమను అలక్ష్యం చేస్తుంది' అనే భావన పిల్లలో కలుగకుండా జాగ్రత్త పడుతుంది. వారికి రకరకాల వంటలు చేసి వడ్డిస్తుంది. పిల్లల నుండి దూరం ఉన్న సమయం ఇంటికి వచ్చింతర్వాత వడ్డీతో సహా పిల్లలకై వెచ్చిస్తుంది.

శాంతి కిరణ్ రాత్రి ఎనిమిది ప్రాంతంలో ఆఫీసు నుండివచ్చాడు. నమితను అప్పటికే ట్యూషను నుండి వచ్చిన పిల్లలను పలకరించి స్నానానికి కెళ్ళాడు. అతను ఫ్రెష్‌కాగానే నలుగురూ కబుర్లతో పాటు భోజనం కూడా చేశారు. చాలా రోజుల తర్వాత ఆ ఇల్లు నవ్వులతో కేరింతలతో వెలిగింది. ఆలుమగల 'ఆ రాత్రి' అనుభూతులు వారి మొదటి రాత్రిని తలపించాయి. మర్నాడు నమితకు డే ఆఫ్. అయిష్టంగా శాంతి ఆఫీసుకు బయలుదేరాడు. అతనికి టాటా చెబుతున్న నమిత 'రాత్రి మళ్ళీ మధుమాసమే' అని చెబుతూందనిపించింది.

పిల్లలను స్వయంగా తయారు చేసి వారికి కూడా వీడ్కోలు చెప్పింది నమిత. తర్వాత తాపీగా స్నానపానాదులు చేసి తను సగం చదివి వదిలేసిన నవలను చేతిలోకి తీసుకుంది. మొత్తం మీద ఆ దినమంతా హుషారుగా గడిపింది నమిత.

శాంతి కిరణ్ ఆఫీసు నుండి వచ్చే సరికి, వంటింట్లో జంతికలు చేస్తోంది నమిత. 'ఆయా' ఆ రోజు తొందరగా వెళ్ళి పోయింది. ముక్కును ఎగబీల్చి కళ్ళతోనే నమితకు విష్ చేసి వాష్ రూంలోకి దూరాడు శాంతి. అలసటని, టెన్షన్ని కడిగే ప్రయత్నం చేశాడు.

"నమీ ! స్ట్రాంగ్ టీ" స్నానం చేసి, టీ.వి. ముందు సెటిలై కేకవేశాడు శాంతి.

"నేను పనిలో ఉన్నాను చూస్తున్నారుగా ? ఆయా ఇవాళ పెందలాడే వెళ్ళింది. కాస్తమీరే కలుపుకోరాదూ?

"చేసే పనేదో ప్రక్కన పెట్టి, నోరు మూసుకుని టీ ఇవ్వు" నమిత మీద విరుచుకు పడ్డాడు 'శాంతి'. అత్తమీద కోపం దుత్తమీద చూపాడు.

నమిత అవాక్కయింది. శాంతికేమయిందివాళ? పిల్లల ముందు రభస చేయడం బావుండదని, గుండెల దాకా వచ్చిన కోపాన్ని దిగమ్రింగి టీ కలిపి, విసురుగా టీపాయ్ మీద పెట్టింది.

నమిత వైపు ఎగాదిగా చూసి కప్పు చేతిలోకి తీసుకున్నాడు శాంతి.

ఆ రాత్రి డైనింగ్ టేబుల్పై ఎలక్ట్రిక్ లైట్ తప్ప వేరే వెలుగు లేదు. ఫ్యాన్ చప్పుడు తప్ప వేరే శబ్దం లేదు. పరిస్థితిని గమనించి పిల్లలు కిక్కురుమనకుండా భోంచేసి, తమ పడకగదికి వెళ్ళారు.

వంటిల్లు సర్ది నమిత బెడ్రూంలో అడుగుపెట్టే సరికి ఫ్యాన్వైపు తదేకంగా చూస్తూ కనిపించాడు శాంతి.

"ఇవాళ శ్రీవారు ఏ 'రేసు' గుర్రం ఎక్కి వచ్చారో?"

"నమీ! నీ ఎకసెక్కాలిక చాలు. ప్రతిదానికీ హద్దుంటుంది. ఆఫీసులో అడ్డమైన వాడికి సంజాయిషీలిస్తూ అలసిపోయి ఇంటికి వచ్చిన భర్తకు టీ నీళ్ళైనా ఇవ్వాల్సింది పోయి, నోరు తెరిచి అడిగినా, నిర్లక్ష్యం చేసే స్థితికి చేరావంటే, నీ ఉద్దేశ్యం ఏమిటి? నేనంత అలుసై పోయానానీకు?" సామరస్యంతో సమస్య పరిష్కరిద్దామను కున్న నమితలో సహనం నశించింది.

"మీరేనా ఉద్యోగంలో అలసిపోయేది? నానా చాకిరీ చేస్తూ నేనూ అలసిపోతాను. అయినా మీలాగ హుకుం చలాయిస్తానా? ఎప్పుడో నేను పనిలో ఉన్నప్పుడు మీకు

మీరు టీ కూడా పెట్టుకోలేకపోతే, మీకు సేవలు చేయడానికి నాకూ తీరికలేదు. ఆ అవసరం కూడా లేదు." నమిత తిప్పికొట్టింది.

"అవును, కట్టుకున్న భర్తకు సేవలు చేసే అవసరం నీకులేదు. ఉద్యోగం వెలగబెడుతున్న ఆధునిక నారీమణిని కదా? నేనే నీ అడుగులకు మడుగులొత్తాలి, అవునా?"

"మీ చేత సేవలు చేయించుకునే అగత్యం నాకులేదు. పరిస్థితిని బట్టి మీ పనులు మీరన్నా చేసుకోమంటాను."

"ముక్కూ మొహం తెలియని వారికి ఊడిగం చేస్తావు. వారి వాంతి ఎత్తుతావు కాని, మూడు ముళ్ళేసి, నిన్ను భరించే భర్తకు సేవలెందుకు చేస్తావు? ఈ ఇంటి పైనున్న లోనుకట్టడానికి, ఇతర ఖర్చులకు నీ జీతం వాడుతున్నందుకు నేనే నీ కాళ్ళు పట్టాలి" శాంతిలో అదే అహం, ఎకసెక్కం.

ఉద్యోగరీత్యా తను చేసే పనులను విమర్శించే సరికి నమిత కోపం నషాళాని కెక్కింది.

"అవును. విమానం ఎక్కే ప్రతి అడ్డమైన వెధవకి సేవ చేస్తాను. అది నా విధి. దానికి నాకుదండిగా జీతం ఇస్తారు. మీరు? ఆ జీతం ఎగరేసుకు పోవడమే కాక, మీ చేతతాళి కట్టించుకున్నందుకు మీకేదో ఋణపడి ఉన్నట్టూ, మీకు కట్టుబానిస నైనట్టూ, మీకు జీవితమంతా చాకిరి చేయమంటారు ఏదో ఓసారి పనిలో ఉండి కాదంటే విరుచుకుపడతారు."

"నువ్వే చేస్తున్నావు బోడి ఉద్యోగం! ధరలు ఆకాశాన్నంటిన ఈ రోజుల్లో ఎందరో ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నారు. అందరూ నీలా మిడిసిపడుతున్నారా? మగన్ని గడ్డిపోచకంటే హీనంగా చూస్తున్నారా? నాలుగు రాళ్ళు సంపాదిస్తున్నాననే ధీమాతోనే కదా నీవు నన్ను లెక్క చేయడం లేదు?" శాంతి తగ్గదలచుకోలేదు.

అతని వితండవాదంతో నమితకు నోటమాట కరువైంది. ఆ వాదనకిక అంతంలేదని పించింది. కళ్ళనిండా నీళ్ళు నిండగా నోటిలో కొంగు కుక్కుకుని అటువైపు తిరిగి వెక్కసాగింది.

శాంతి అహం శాంతించింది. భార్యను నిరుత్తరాలిని చేశాననే తృప్తికలిగింది. అతనూ వేరే వైపు తిరిగి దుప్పటికప్పుకున్నాడు. నమితలో తీరని ఆవేదన, క్రితం రాత్రికీ ఈ రోజుకూ ఎంత తేడా? ఎన్నో మధురోహలతో గడపాల్సిన ఆ రాత్రి, ఆ ఇద్దరికీ కాళరాత్రి అయింది.

మర్నాడు శాంతి కంటే ముందే లేచి డ్యూటీకి బయలుదేరింది నమిత.

ముచ్చటగా మూడో ఫ్లైట్‌తో ఆ రోజు రాత్రి ఏడుగంటలకు నమిత, శమితల డ్యూటీ ముగిసింది. దినమంతా అన్యమనస్కంగా గడిపిన నమిత, అశోకా హోటల్‌లోని తన రూంలో ఓ గంటసేపు బాత్ టబ్‌లో గడిపింది. ఫ్రెష్ అయి, శమిత రూంకెళ్ళి ఇద్దరికీ డిన్నర్ ఆర్డరు చేసింది. ఏదో చెప్పాలని తన రూంకి వచ్చిందని గమనించిన శమిత, నమిత స్థిమిత పడే దాకా ఆగి, విషయం కదిపింది. క్రితం రాత్రి జరిగిన సంఘటన, వాదోపవాదాలూ అన్నీ పూసగుచ్చినట్టు చెప్పింది నమిత. ఇంతలో ఆర్డరు చేసిన పదార్థాలు వచ్చాయి. భోజనం చేస్తూ మాటలు కొనసాగించారు.

"నువ్వు చెప్పిందాన్ని బట్టి మీ తగువు 'టీ కప్పులో తుఫాను'లా ఉంది. ఇలాంటివి ప్రతి ఇంట్లో జరిగేవే. భార్య సంపాదిస్తున్నా 'ఆ ఉద్యోగ బాధ్యతలతో పాటు తనకూ ఊడిగం చేసి తీరాలి' అనుకుంటాడు సగటు భర్త. మీ శాంతి ఈ విషయంలో నయమనిపిస్తుంది. నిన్నేదో టెన్షన్లో ఉండి నోరు జారాడేమోకాని ఇలాంటి మనస్పర్థ లొచ్చినట్టు ఎప్పుడూ చెప్పలేదు నువ్వు. నీకు భర్తపోరు మాత్రమే. నాకు అదనంగా అత్తా, ఆడబిడ్డల పోరు! వారి మాటలు ఈ చెవితో విని ఆ చెవి నుండి విసిరేస్తాను. మరీ మితిమీరితే తప్ప సహనం కోల్పోను. నాకు నచ్చిందే చేస్తాను. అలా సంయమనం పాటిస్తూ రోజులు వెళ్ళదీస్తున్నాను. ఈ పాటికి మావారు కూడా అడ్జస్టయ్యారు" శమిత, నమితకు 'గీత' బోధ చేసింది. నోరుజారకుండా, తన అభిప్రాయాలకు, భావాలకు భంగం వాటిల్లకుండా, తాను నమ్మిన సూత్రాలతో, సిద్ధాంతాలతో రాజీ పడకుండా వాదనకు ఎక్కడ 'గీత' గీయాలో నమితకు బాగా అర్థం అయింది. మగవాడి అహాన్ని ఒక రుగ్మతగా భావించి చికిత్స చేయాలి తప్పితే, వాదనతో నెగ్గడం కష్టమనీ" అలా ప్రయత్నించడం అర్థరహితమనీ, శమిత మాటలవల్ల తెలుసుకుంది. రాత్రి నిద్రకిక ఢోకాలేకుండా పోయింది.

ముంబయిలో శాంతి కూడా అన్యమనస్కంగా దినంగడిపాడు. ఆఫీసు తర్వాత తన సహోద్యోగితో కలిసి బీర్‌బార్ వైపు నడిచాడు. ఎప్పుడో గాని 'బీరు' కాయముట్టని శాంతిలో ఏదో అగ్నిజ్వాల రగులుతోందని గ్రహించిన కాంతికుమార్ ఓ గ్లాసు పూర్తయ్యే దాకా తన దృష్టి తాగడం, తినడం పైనే కేంద్రీకరించాడు. బీరు, తన పని ప్రారంభించింది. శాంతి మొదలు పెట్టాడు.

"నీ పనే నయంకాంతీ! మీ శ్రీమతి ఇంట్లోనే ఉండి నిన్నూ, పిల్లలనూ, ఇంటినీ చూసుకుంటుంది. ఆమె అన్నీ అమరిస్తే మీరు హాయిగా అనుభవిస్తారు."

"ఇప్పుడీ ప్రసక్తి ఎందుకొచ్చింది? మాకైతే మీ కాపురమే చీకూ చింతల్లేనిదని పిస్తుంది. సుఖజీవనానికి కావలసినవన్నీ ఏ మాత్రం తడుముకోకుండా సమకూర్చు కున్నారు." దూరపు కొండలు నునుపని చెప్పకనే చెప్పాడు కాంతి కుమార్.

అది నిజం కాదనీ, తమ జీవితంలోనూ చీకటి కోణాలున్నాయని చెప్పాడు శాంతి. తమ మధ్య క్రితం రాత్రి జరిగిన సంఘటనను క్లుప్తంగా చెప్పాడు శాంతి.

అన్నీవిన్న కాంతికి కూడా శాంతి, నమితల ప్రవర్తన మోతాదుకు మించిందని పించింది.

"చూడు శాంతీ! సంసారంలో ఇవి మామూలే. 'కాపురమనే బండికి భార్యా, భర్తలు జోడెద్దులు' అని ఎన్నో కథల్లో చదివాం. సినిమాల్లో చూశాం. నిత్య జీవితంలో చేయవలసిన పనులు, భార్యాభర్తలు వారి వారి వెసులుబాటు ప్రకారం చేసుకోవాలి. 'భర్త సంపాదించే వాడు, భరించేవాడు" కాబట్టి భార్య అతనికి అణిగిమణిగి ఉండాలి' అన్న పద్ధతికి నూకలు చెల్లాయి. మనం మన అహాన్ని ప్రక్కన పెడితే, ఏతంటా ఉండదు. నా భార్య ఉద్యోగికాకున్నా, ఆమెకు నేను ఇంటి పనిలో, వంట పనిలో సహాయపడతాను. అది నాకేమాత్రం నామోషీకాదు. ఉమ్మడి బాధ్యతను కలిసి పంచుకుంటే తప్పేముంది? నమిత ఉద్యోగరీత్యా ప్రయాణీకులకు చేసే సేవకూ, భార్యగా నీ పట్ల నిర్వహించాల్సిన విధులకు తేడా వుంది. రెంటిని పోల్చి ఎత్తిచూపడం హాస్యాస్పదం. కాస్త బుర్రకు పని చెబితే నీకీ విషయం స్పష్టంగా అర్థమౌతుంది" పిలిచి బీరు పోయిస్తే నాకేక్లాసు పీకాడని చిరాకు పడ్డాడు బీరు తలకెక్కిన శాంతి కిరణ్. ఇంకొంత తాగాలని ఉన్నా మనసు విరిగి అంతటితో బాటమ్స్ అఫ్ చెప్పాడతను.

"వచ్చే ఆదివారం నమితకు ఆఫ్ ఉంటే మా ఇంటికి భోజనానికి రండి. ఇంకా ఏమైనా సందేహాలుంటే, అవీ తుడుచుకుపోతాయి." కాంతి, శాంతికి వీడ్కోలు చెప్పాడు. మర్నాడు, ఢిల్లీలో నిద్రలేచిన నమిత, ముంబయిలో మేల్కొన్న శాంతి కిరణ్, ఇద్దరి ఆలోచనా సరళిలో మార్పు వచ్చింది. అహం చోటు విచక్షణ తీసుకుంది. ఆ వారాంతంలో వారు కాంతికుమార్ ఇంటికి భోజనానికి వెళ్ళారు. కాని వారికి 'క్లాసు' తీసుకునే అవకాశం ఇవ్వలేదు. కాంతి కుమార్ దంపతులు కొసరి కొసరి వడ్డిస్తుంటే భోజనాన్ని బాగా ఆస్వాదించారు. మరుసటి ఆదివారం తమ ఇంటికి ఆహ్వానించారు.

ఇంటికి తిరిగివచ్చి రాత్రిని కూడా సద్వినియోగం చేసుకున్నారు. కలతలు లేని నిద్రపోయారు.

మర్నాడు నమిత కంటే ముందే నిద్రలేచాడు శాంతి. కాఫీ, టిఫిన్ తయారు చేసి, నమిత కు కాఫీ కప్పుతో సుప్రభాతం పలికాడు. నమిత కళ్ళల్లో ఆశ్చర్యానందం! "దొరుకునా ఇటువంటి సేవ...." ప్రక్కవారి రేడియోలో బాలమురళీ కృష్ణ శ్రావ్యంగా గానం చేస్తున్నాడు.